
ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పార్వతీపురం : డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సోమవారం విడుదల చేశారు. డివిజన్ పరిధిలో 36 చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ పోస్టులను నియమించనున్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 18 లోగా పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గానీ, సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో గానీ దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. 19న దరఖాస్తుల పరిశీలన, 21న హాల్ టికెట్ల జారీ, 23న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. 26న ఫలితాలు ప్రకటిస్తామని, 28న మౌఖిక పరీక్షను సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించి 30న తుది ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. అలాగే పాలకొండ డివిజన్ పరిధిలో డీలర్ పోస్టుల భర్తీకి సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. డివిజన్ పరిధిలో 21 డిపోలకు డీలర్ పోస్టులను నియామకం జరుగుతుం దన్నారు.

తోరణాల అలంకరణతో ముస్తాబైన మహాసభ వేదిక



మహాసభలకు సర్వం సన్నద్ధం

- నేడు, రేపు సిపిఎం 10వ జిల్లా మహాసభ
- ఎర్ర జెండాలు, తోరణాలతో కురుపాం ముస్తాబు
- రావాడ జంక్షన్లో బహిరంగ సభ
- హాజరు కానున్న జాతీయ, రాష్ట్ర నేతలు పుణ్యవతి, తులసీదాస్, సుబ్బారావమ్మ

ప్రజాశక్తి - కురుపాం

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభలు కురుపాంలో నేటి నుంచి రెండు రోజులు పాటు జరుగనున్నాయి. మహాసభలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మహాసభల నేపథ్యంలో కురుపాం ముస్తాబైంది. ముఖ్య కూడళ్లు, పాత ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఎర్రజెండాలు తోరణాలతో ముస్తాబు చేశారు. ప్రతినిధుల సభ జరగనున్న సాయినందన కల్యాణ మండపం ప్రాంతానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిని గుర్తు చేసుకుంటూ కె.కె సీతారాం ఏచూరి నగర్గా నామకరణం చేశారు. సభా ప్రాంగణానికి బుద్ధదేవ్ భట్టాచార్య పేరు, వేదికకు రుద్రరాజు సత్యనారాయణ రాజు పేర్లు పెట్టారు. బహిరంగ సభ వేదికను, ప్రతినిధుల సభ జరిగే వేదికను ఎర్రజెండాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. మహాసభల మొదటి రోజు మంగళవారం ఉదయం 11 గంటలకు కురుపాం పాత బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి మీదుగా రావాడ రోడ్డు జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి. తులసీదాస్, కె.సుబ్బారావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ హాజరై సభలో ప్రసంగించనున్నారు. ర్యాలీ, బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. మహాసభలను పండగ వాతావరణం నిర్వహించేందుకు పార్టీ కేడర్ సమాయత్తమైంది. మహాసభ జరిగిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలు, ఇంకా పేదలు, రైతులు, దళితులు, గిరిజనులు వంటి అణగారిన తరగతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించనున్నారు. వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందించనున్నారు. పలు సమస్యల పరిష్కారానికి తీర్మానాలను సభ ఆమోదానికి పెట్టనున్నారు.

ఉద్యమ స్ఫూర్తి... మన్యం కీర్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దోపిడీకి వ్యతిరేకంగా అలుపెరుగని ఉద్యమాలు
అశువులు బాసి హక్కులు సాధించిన అమరవీరులెందరో !

CPM 10 పార్వతీపురం మన్యం జిల్లా వ మహాసభలు డిసెంబర్ 10, 11, కురుపాం

దున్నే వాడిదే భూమి... వెట్టిచాకిరీ నుంచి విముక్తి అనే నినాదంతో సీతంపేట, పార్వతీపురం ఏజెన్సీల్లో ఉవ్వెత్తున ఉద్యమాలు జరుగుతున్న రోజులవి. ఇప్పటి మాదిరి సమాచార, సాంకేతిక వ్యవస్థ అభివృద్ధి చెందకపోయినప్పటికీ గిరిజన గూడేల నుంచి తండోప తండాలుగా వచ్చి ఉద్యమంలో భాగస్వామమౌతుండే వారు. వీరందర్నీ మరింతగా ఉత్తేజ పర్చేందుకు, దోపిడీవర్గాల కుట్రలను ఎదుర్కొనేందుకు 1967 అక్టోబర్ 31న కమ్యూనిస్టు పార్టీ మొండెంఖల్ గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఈ సభకు విద్యార్థులు, మహిళలు, గిరిజనులు పిల్లాపాపలతో వెళ్లారు. ఈ సభను భగ్నం చేసేందుకు పలువురు భూస్వాములు పి.లేవిడి గ్రామం వద్ద ఆదివాసీలపై దాడులు చేశారు. ఆ కాల్పుల్లో ఇద్దరు ఆదివాసి యువకులు మరణించారు. వారే శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తొలి అమరవీరులు ఆరిక కోరన్న, కొండ గొర్రె మంగన్న. మన్యంలో నాడు అధిక శాతం భూమి జమీందారులు, సంస్థానాధీశుల ఆధీనంలో ఉండేది. ఆదివాసీలు రెక్కల కష్టంతో సాగుచేసిన వ్యవసాయ పంటలు, అడవుల్లో సేకరించిన అటవీ ఉత్పత్తులు తప్పుడు లెక్కలు, బెదిరింపులు, దౌర్జన్యాలతో జమిందారులు లాక్కునేవారు. గిరిజనులకు అక్షర జ్ఞానం లేకపోవడం, కనీసం అంకెలు కూడా తెలియక పోవడంతో భూస్వాముల దోపిడీకి అడ్డూ అదుపూ ఉండేది కాదు. ఈ దోపిడీనీ అరికట్టేందుకు,. గిరిజనులను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన గిరిజన సంఘం ఈ ప్రాంత ఉద్యమాలకు ఊపిరిరైంది. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, నిర్మలమ్మ, సుబ్బారావు పాణిగ్రహి తదితరులు ముందుండి ఉద్యమాలను నడిపించారు. వీరితో సహా సుమారు 385మంది కార్యకర్తలు 1967లో అమరులయ్యారు. సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు, ఆయన భార్య సంపూర్ణమ్మ సహా వందలాది మందిని జైల్లోపెట్టారు. 1971 వరకు వివిధ దశల్లో ఉద్యమాలు జరిగాయి. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోలీసు తూటాలకు బలైపోయారు. ఆరిక గుంపస్వామి, కొండగొర్రె లచ్చన్న, నిమ్మల కృష్ణమూర్తి, బిడ్డిక శ్రీరాములు, బిడ్డిక వసంత, పల్లెరుక రఘురాములు తదితరులు జైలు పాలయ్యారు. అయినా ఉద్యమాలు కొనసాగడంతో దోపిడీ తగ్గింది. సాలూరు ప్రాంత గిరిజనులు బ్రిటిష్వారి నిరంకుశ పాలనకు, దోపిడీకి విసిగి క్రీ.శ.1900 మే నెలలో 'కొర్రమల్లయ్య' కొండదొర నాయకత్వాన కొర్రవానివలస దగ్గర తిరుగుబాటు చేసినట్టు చరిత్ర చెబుతోంది. ఈ తిరుగు బాటు ఉద్యమంలో ఎంతోమంది అరెస్టయ్యారు. ఇందుకోసం పార్వతీపురం, సీతంపేట సహా పాడేరు, రంప చోడవరం కేంద్రంగా ఐటిడిఎ, జిసిసి ఏర్పాటయ్యాయి. అనంతరం 2004లో కమ్యూనిస్టుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన యుపిఎ -1 ప్రభుత్వంలో గిరిజన అటవీ హక్కుల చట్టం ఏర్పడింది. ఇలా గిరిజనులు పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణతోపాటు గిరిశిఖర గ్రామాల్లో విద్య, వైద్యం, రహదారి సదుపాయాలు ఇప్పుడిప్పుడే మెరుగు పడుతున్నాయి. అయినా, గిరిజన ప్రాంతం ఇప్పటికీ విద్య, వైద్యం, రహదారులు తదితర ఎన్నో సమస్యలతో సతమతమౌతోంది. జిసిసిని పాలకులే నిర్వీర్యం చేయడంతో అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావడం లేదు. గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని, ప్రభుత్వం, ప్రభుత్వం రంగ సంస్థల్లో గిరిజనులకు ఉన్న రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పోరాడుతోంది. నాటి ఉద్యమ స్ఫూర్తితో సిపిఎం ఆధ్వర్యాన ముందుకు సాగితే గిరిసీమలన్నీ ప్రగతి దారులు కానున్నాయి.

> **నేటి మన్యం జిల్లా నాటి శ్రీకాకుళం గిరిజన రైతాంగం పోరాటానికి ఎంతో ఊపునిచ్చింది. భూమి కోసం... భుక్తి కోసం పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి దిక్కూ నినదించింది. 1960వ దశకంలో సాగిన ఈ ఉద్యమం పార్వతీపురం, సీతంపేట ప్రాంత ఏజెన్సీలో గిరిజన గూడేలంతటా విస్తరించింది. దోపిడీవర్గంపై ఇలా సాగిన ఉద్యమంపై కాల్పులు జరపడంతో ఈ ప్రాంతానికి చెందిన కోరన్న, మంగన్న అశువులు బాశారు. వీరి త్యాగాలకు ప్రతిరూపంగా ఏజెన్సీలో వారి స్థూపాలు దర్శనమిస్తాయి. కోరన్న, మంగన్న స్ఫూర్తితో వారి వర్ధంతి రోజు (అక్టోబర్ 31)న నాటి ఉద్యమ ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ స్థానిక గిరిజనులు ఇప్పటికీ నివాళులర్పిస్తున్నారు. దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన ఈ పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకం. పోరాట ఫలితంగా గిరిజనులు అడవితల్లిపై హక్కులు సాధించారు. ధరలో దగా.. తూకంలో మోసాలను ఛేదించుకున్నారు. గిరిజనుల్లో ఐక్యతకు ఈ ఉద్యమం నాందిపలకడంతో అనేక హక్కులు సాధించుకున్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తితో మన్యం జిల్లాలో సిపిఎం ప్రజాపోరాటాలు నిర్వహిస్తోంది. ఆ నేపథ్యంలోనే ఉమ్మడి విజయనగరం జిల్లాలో సిపిఎం మొదటి మహాసభ గుమ్మలక్ష్మీపురంలో జరిగింది. తాజాగా ఈనెల 10,11 తేదీల్లో సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభలు కురుపాం కేంద్రంగా జరగనున్నాయి.**





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు

పిహెచ్సిలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం

- ఐటిడిఎలకు పూర్వ వైభవం తెస్తాం
- ఉద్యానవన పంటలతో పరిశ్రమల స్థాపనకు కృషి
- సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు
- ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- డిఆర్సి సమావేశంలో జిల్లా ఇన్ఛార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రజాప్రతినిధులు, జిల్లాయంత్రాంగం, అధికారుల సమిష్టి కృషి, సహకారంతో జిల్లా అభివృద్ధి సాధ్యమౌతుందని జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమాభివృద్ధిశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 33 శాతం గిరిజనులుండే ఈ ప్రాంతం పూర్తిగా పేదరికం జిల్లా అని, కావున అందరి సహకారం, మంచి చేయాలనే తపన, చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అభివద్ధి సమీక్షా కమిటీ (డిఆర్సీ) సమావేశం జిల్లా ఇన్చార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగింది. జిల్లాలో ఇప్పటికీ చాలా గ్రామాలకు రహదారి సదుపాయం లేదని, ఆరోగ్యం బాగాలేకపోతే డోలీ మోతలు తప్పకపోవడం విచారకరమన్నారు. త్వరలో రోడ్లు సదుపాయం లేని గ్రామాలను గుర్తించి, రానున్న రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే తన ముందున్న ధ్యేయమని అన్నారు. రూ. 850 కోట్లతో గుంతలు లేని రహదారుల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని, ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ఇప్పటికే ప్రారంభించి నిలిచిపోయిన పనులను ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా చేపడతామని అన్నారు. ముఖ్యంగా మధ్య, చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు.

ఈప్రాంతంలో వ్యవసాయం వర్షాలపై ఆధారపడాల్సి వస్తుందిని, జంఝావతి సమస్యను పరిష్కరించుకోగలిగి, ఎత్తిపోతల పథకాలపై దృష్టి సారిస్తే జిల్లాలో సాగునీటి సమస్య తీరుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. జిల్లాలో రెండు ఐటిడిఎలు ఉన్నప్పటికీ గత ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, వాటికి తాము పునరుజ్జీవం తీసుకువస్తామని మంత్రి చెప్పారు. లాభసాటి ఉద్యానవన పంటలతో పాటు పండ్ల పరిశ్రమలను స్థాపించి మరింత అధిక లాభాలు ఆర్జించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. జీడీ, మామిడి, పైనాపిల్ వంటి పండ్ల రసాల తయారుచేసే పరిశ్రమలను నెలకొల్పాలని, ఇందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు తక్కువగా ఉన్నారని, పూర్తి స్థాయి అధికారులు కూడా లేరని, అందువల్ల అభివద్ధి కుంటుపడే అవకాశం ఉన్నందున, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి వివరించారు.

జిల్లాలో 37ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్సిలు) 24/7 ఉన్నాయని, రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున ఆరోగ్య కేంద్రాలు ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. అవసరమైన పిహెచ్సిలుఉన్నప్పటికీ, అందులో వైద్యులు, సదుపాయాలు, మందులు ఉండాలని, రోగులు వస్తే ఆదరించే పరిస్థితి ఉండాలని తెలిపారు. పిహెచ్సిలపై ప్రత్యేక దృష్టి సారించి వైద్యులు, మందులు, అంబులెన్సులు వంటి సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రక్తహీనత లోపం జిల్లాలో ఎక్కువగా ఉందని, దీనిపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తామని చెప్పారు. రానున్న రెండేళ్లలో రహదారి సౌకర్యం కల్పిస్తామని, ఇందుకు అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అలాగే విద్యపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని, మరో 5 మాసాల్లో డీఎస్సీ తీయబోతున్నట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం సమగ్ర కలెక్టరేట్ భవనం మాదిరిగా జిల్లాలో కూడా కొత్త కలెక్టరేట్ నిర్మాణం జరగాలని, ఇప్పటికే కేటాయించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కళ్ళాల్లోని ధాన్యాన్ని తడవకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైతే మిల్లులకు తరలించాలని మిల్లు యాజమాన్యం ఉపక్రమిస్తే తదుపరి చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. లాభసాటి ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించేలా ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల దాడితో రైతులు పండించిన పంటలు నష్టంపోకుండా తగిన చర్యలు చేపట్టాలని డిఎఫ్ఒను ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య సహాయకుల పోస్టులను సంబంధిత శాఖల పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. త్వరలో వెటర్నరీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేస్తామని, వెటర్నరీ బిల్డింగులను నాబార్డ్ నిధులతో నిర్మిస్తామని అన్నారు. జిల్లాలో సమీకృత భూసార పరీక్షా కేంద్రాన్ని, మత్స్య పెంపక కేంద్రాన్ని, జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మంజూరు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో రూ. 140 కోట్లతో ఆధునిక వ్యవసాయ పనిముట్లను రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, రహదారులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సమన్వయంతో జిల్లాను అభివద్ధి పథంలో నడిపించాలని అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధికారులను సమన్వయం చేసుకొని అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రికి తెలిపారు.

సమావేశంలో జిల్లాపరిషత్ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక రాజేశ్వరి, ట్రైకార్ చైర్మన్ బొరగాం శ్రీనివాసులు, ఎంఎల్సీలు ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, పార్వతీపురం మున్సిపల్ చైర్మన్ గౌరీశ్వరి, ఎస్పీ ఎస్వి మాధవరెడ్డి, జెసి ఎస్ఎస్. శోబిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ కె.హేమలతతో పాటు అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీరు

రానున్న ఐదేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీటి వసతి కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మిషన్ మోడ్లో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. జిల్లాలో జంఝావతి, తోటపల్లి, వంశధార, ఇతర నీటి వనరులు ఉన్నాయని, వాటి ద్వారా సమగ్రంగా తాగునీటిని ఉపయోగించుకొని మన్యం జిల్లా తొలి స్థానంలో నిలవాలని, ఆ బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

చెరకు రైతులకు మద్దతు ధర అందేలా చూడాలి : జెడ్పి చైర్మన్

చెరకు రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. చెరకు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి రైతులకు మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ నాగావళి కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం రూ. 24 కోట్లు ఖర్చు చేసిందని, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఈ పనులను ప్రాధాన్యత లేని జాబితాలో చేర్చడం తగదని అన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

కలెక్టరేట్ వద్ద గిరిజన అవుట్సోర్సింగ్ సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అవుట్సోర్సింగ్ సిబ్బంది

ప్రభుత్వం దిగొచ్చి గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు డిఎస్సి నుంచి మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించేంత వరకూ పోరాటం ఆగదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఐటిడిఎ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గతంలో "జాబు కావాలంటే –బాబు రావలి" అన్నవారి పాలనలో గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల జాబు పోయే పరిస్థితి కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రి పోస్టులు మినహాయించి డిఎస్సి ర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఇంచార్జి మంత్రి కింజరాపు అచ్చెంనాయుడుకు గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. తమ పోస్టులు డిఎస్సి నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు శోభారాణి, యమున, గున్నమ్మ, ఉమా రాణి, కళ్యాణి, జ్యోతి, రాజేష్, దివాకర్, వెంకట్, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సీతంపేటలో శాంతియుత నిరసన ర్యాలీ

సీతంపేట : గిరిజన గురుకులంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులు, విద్యార్థుల సమస్యలపై సోమవారం ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. సీతంపేట హైస్కూల్ నుంచి ఐటిడిఎ అడవి తల్లి విగ్రహం వరకు ప్లే కార్డులు పట్టుకుంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను అగౌరవపర్చడం మానుకోవాలని, ఏజెన్సీలో స్పెషల్ డిఎస్సి తీయాలని, ఆదివాసీ ఐక్యత వర్ధిల్లాలని, గిరిజన గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నినాదాలతో సీతంపేట మారు మోగింది. ఢంకాలు, డప్పులతో నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బస్ స్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. అక్కడ నుంచి ఐటిడిఎ వద్ద గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరాహారదీక్ష శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గురుకులం పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ. అధ్యాపకుల ఉద్యోగ భద్రత కల్పించి సీఆర్టీలుగా కన్వర్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్సి ప్రకారం జీతాలు ఇవ్వాలని అన్నారు. 2024 డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల్లేక చదువుకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యను అందించాలని అన్నారు. ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు న్యాయం చేసి తిరిగి వీధుల్లోకి తీసుకోవాలన్నారు. జీవో 3కు ప్రత్యామ్యయంగా కొత్త చట్టం చేయాలి అన్నారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ ఎపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, రామ్మోహన్ రావు, సర్పంచులు వెంకి నాయుడు, సుందరమ్మ, తిరుపతిరావు, ఆదిలక్ష్మి, గిరిజన సంఘ నాయకులు అప్పారావు, సాంబయ్య, లక్ష్మణరావు, రామస్వామి, అజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, ఉపాధ్యాయులు గణేశ్వరరావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల ఏరివేతకు తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

సామాజిక పింఛన్ల తనిఖీకి రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేట పంచాయతీల్లో పింఛన్ల తనిఖీని అధికారులు సోమవారం చేపట్టారు. డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎన్.రమేష్రామన్ ఆధ్వర్యాన 20 మంది అధికారుల బృందం పింఛన్ల తనిఖీ చేపట్టింది. ఈ బృందంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు, పార్వతీపురం, బలిజిపేట, బొబ్బిలి మండలాలకు చెందిన వివిధ శాఖ ల అధికారులు పాల్గొన్నారు గ్రామంలో 394 పెన్షన్ ఉన్నాయి. ఈ పింఛన్లు ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేసేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు చొప్పున ఉన్నారు. పింఛను తీసుకుంటున్న వ్యక్తి బతికి ఉన్నాడా లేదా? ఆదాయం, భూమి, వాహనం, ఉద్యోగం, 300 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం, పట్టణాల్లో ఇంటి స్థలం, ఆదాయ పన్ను, ప్రైవేట్ ఉద్యోగం, వివాహపత్రం, డెత్ సర్టిఫికెట్, వికలాంగులకు తదుపరి పరీక్ష సదరం సర్టిఫికెట్తో పాటు వృత్తిదారులకు, వృత్తి సర్టిఫికెట్ వంటి పలు అంశాలతో ఈ సర్వే బృందం పరిశీలించింది.



లచ్చయ్యపేటలో సర్వే చేస్తున్న అధికారులు

ఇదిలా ఉండగా సర్వే చేసిన సమయంలో ఆ వ్యక్తి ఉపాధి కోసం బయటకు వెళ్లే అదే విషయాన్ని సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. ఈ సర్వే వల్ల ఎక్కువ మంది పింఛనుదారులు పింఛన్లు పోతాయని ఆందోళన చెందుతున్నారు.

అచ్చెన్న ప్రాపకం కోసం తమ్ముళ్ల ఆరాటం

వేర్వేరుగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గ్రూపులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ఇంఛార్జి మంత్రిగా తొలిసారి విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడి ప్రాపకం కోసం తెలుగు తమ్ముళ్లు తెగ ఆరాటపడ్డారు. సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశానికి హాజరైన ఇంఛార్జి మంత్రికి నర్సిపురం గ్రామ పొలిమేరల్లో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు స్వాగతం పలికారు. నర్సిపురంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఇతర నాయకులు ఘనస్వాగతం పలికారు. జిల్లాలో ఇక నుంచి ఇంఛార్జి మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు ఆదేశాలు అమలుకావడం అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కీలకమైన వ్యవహారాలన్నీ ఆయన కనుసన్నల్లోనే జరగాల్సి వుంది. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో సహా మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు, వారి నియోజకవర్గాల్లో వారి వ్యతిరేక గ్రూపు నాయకులు, మాజీఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు ఆయన్ను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆయన దృష్టిలో పడ్డానికి తాపత్రయ పడ్డారు. డిఆర్సీ సమావేశం అనంతరం ఇంఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యాన జరిగిన కూటమి పార్టీల సమావేశానికి హాజరయ్యారు.

ద్వారపురెడ్డికి నిరాశ

ఇన్ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు రాక కోసం సోమవారం ఉదయం నుంచి ఎదురు చూసిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అనుచరులకు నిరాశే మిగిలింది. ఉదయం నర్సిపురం గ్రామ పొలిమేరల్లో అచ్చెన్నాయుడుకు స్వాగతం పలికిన ద్వారపురెడ్డి, చిరంజీవులకు చుక్కెదురైంది. అచ్చెన్నాయుడు తన నివాసానికి వస్తారని భావించిన ద్వారపు రెడ్డి నియోజకవర్గం నలుమూలల నుంచి స్థానిక నాయకులను, కార్యకర్తలను రప్పించారు. సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్యే విజయచంద్ర ఇంటివద్ద జరిగిన సమావేశంలోనే అచ్చెన్నాయుడు గడిపారు. అక్కడ నుంచి ద్వారపురెడ్డి నివాసానికి వెళ్లకుండా వెళ్లిపోయారు. దీంతో అక్కడకు హాజరైన నాయకులు కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద దళిత, గిరిజనులు ఆందోళన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగి మేజర్ పంచాయతీ పరిధిలో గల అప్పయ్యపేటలో తాగునీటి సమస్య తక్షణం పరిష్కరించాలని ఆ గ్రామ ఎస్‌సి, ఎస్‌టిలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన, నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ రెండు నెలలుగా అప్పయ్యపేట ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తాగు నీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు, పంచాయతీ ఇఒకు పలుమార్లు చెప్పినప్పటికీ నేటికీ ఆ సమస్య పరిష్కరించపోవడం దారుణమన్నారు. పాత పైపులు గతంలో ఉన్నప్పుడు కొంతవరకు సమస్య ఉన్నప్పటికీ ఎంతో కొంత నీరు సరఫరా అయ్యేదన్నారు. ప్రస్తుతం జలజీవన్ పేరుతో ఇంటింటి కొళాయిలు వేసినప్పటికీ ఆ కుళాయిలు సక్రమంగా పనిచేయకపోవడంతో పూర్తి స్థాయిలో రెండు నెలలుగా తాగునీరు నిలిచిపోయిందన్నారు. అయినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. అనంతరం ఎంపిడిఒ త్రివిక్రమారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇప్పటివరకు ఆ సమస్య తన దృష్టి రాలేదని ఇప్పుడు చెప్పడంతో తెలిసిందని, సంబంధిత పంచాయతీ ఇఒ, అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులతో పాటు అప్పయ్యపేట ఎస్‌టి, ఎస్‌సి కాలనీ సంబంధించిన కుటుంబీకులు పాల్గొన్నారు.

తాగునీటి పరిష్కరించిన ఎంపిడిఒ

తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళనకు తక్షణమే ఎంపిడిఒ త్రివిక్రమరావు స్పందించిన ఆ గ్రామానికి చెందిన అధికారులతో ఎస్‌టి, ఎస్‌సి కాలనీకి వెళ్లి సమస్యను గుర్తించారు. తక్షణమే దగ్గరుండి ఆయన పర్యవేక్షణలో మరమ్మతులు నిర్వహించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గత రెండు నెలలుగా తాగునీటికి ఇబ్బంది గురైన ఎస్సీ, ఎస్టీ కుటుంబీకులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్, ఇన్‌ఛార్జి ఇఒ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

పట్టాలివ్వాలని గిరిజనుల ధర్నా

పార్వతీపురం : తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ గిరిజనులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడువలస, కొత్త పాకలు, వెలుగ వలస పంచాయతీ ములగవలస, సంగివలస, దోనిగెడ్డవలస, వెలగవలస గ్రామాలకు చెందిన గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు మెల్లక రాము మాట్లాడుతూ సర్వే నెంబర్ 1/1లో వున్న ప్రభుత్వ గయ్యాలు భూమిని గిరిజనులు సాగు చేస్తున్నారని చెప్పారు. 100 ఎకరాల భూమిలో 40 ఎకరాల వరకు గిరిజనులకు పట్టాలిచ్చారని, మిగిలిన 60 ఎకరాల్లో గిరిజనులకు పట్టాలివ్వాలని కోరారు. ఆందోళనకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మద్దతు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద చిరు వ్యాపారుల ధర్నా

రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం సిఐటియు జిల్లా నాయకులు జి.వెంకటరమణ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని చెప్పారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు తప్పవు : ఎస్‌డిసి

ప్రజాశక్తి - పార్వతీపురం

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలే తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రా రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ ప్రాంగణంలో గల గిరిమిత్ర సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ మురళీధరన్, కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తితో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి ఉద్యోగం వచ్చే వరకు పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పోషించాల్సిన బాధ్యత పిల్లలు తీసుకోవాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను విస్మరించిన వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రతి వారం స్పందనకు వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ పరిష్కార వేదికకు 114 అర్జీలు అందాయి. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ, డిఆర్‌డిఎ, డిఎంహెచ్ఒ, పంచాయతీ రాజ్, సాంఘిక సంక్షేమ, పశు సంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఉద్యానవన, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

పార్వతీపురంరూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ వివిసిఎం ఎర్రంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌కు 31 వినతులు

సీతంపేట : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఐటిడిఎలో సోమవారం ఎపిఒ జి.చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయి. ఓంద్రుజోల గ్రామానికి చెందిన వెంకట్రావు పంట పొలాలకు సాగునీరు అందించడానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరారు. భరణి కోటకు చెందిన సవర రంగారావు సీసీ రోడ్డు మంజూరు చేయాలని, నిమ్మక రాంబాబు కీరప స్కూల్‌కు అదనపు తరగతి గది మంజూరు చేయాలని, పరశురాంపురానికి చెందిన ఢిల్లీశ్వరరావు అంబులెన్స్ డ్రైవర్ పోస్ట్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కమల పాండియన్, సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు, హెచ్ఒ జయశ్రీ, ఏటిడబ్ల్యుఒ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

13న రైతు సమస్యలపై వైసిపి ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈనెల 13వ తేదీన రైతు సమస్యలపై నియోజకవర్గ వైసిపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ రైతన్నలకు ఇస్తామన్నా పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. దీంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి తరపున పోరాడేందుకు వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 13న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆరోజు మన పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో వందలాది మంది రైతన్నల సమక్షంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామం నుంచి తప్పకుండా నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపిపిలు జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.


ప్రదర్శనను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త ధ్రువ

ఘనంగా రైతు సదస్సు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సంతోషపురంలో కృషి విజ్ఞాన కేంద్రం, నైర వ్యయసాయ కళాశాల విద్యార్థులు సోమవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సమాన్వయకర్త డాక్టర్ ఎస్. ధ్రువ (వ్యవసాయ శాస్త్రవేత్త) మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆధునిక వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని, విద్యార్థులు గ్రామీణ పంటల సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథి నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. భరతలక్ష్మి (వ్యవసాయ శాస్త్రవేత్త) మాట్లాడుతూ రైతులు ఎగుమతికి అనుకూలంగా పంటలు పండిస్తే అధిక లాభాలు పొందవచ్చునని అన్నారు. ఆధునిక వ్యవసాయ పరికరాలతో నూతన విధానంలో పంటలు సాగు చేపట్టాలన్నారు. అరటి, వరిలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, గ్రామంలో పండించే వివిధ పంటల యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను, గ్రోమోర్ కంపెనీ సిబ్బంది సందర్శనకు ఉంచిన వివిధ ఎరువులను, పురుగు మందులను సందర్శించారు. ఈ కార్యక్రమానికి నైరా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి. రాజేంద్ర కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డి. అనిల్ కుమార్, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. అనంత విహారి, డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ ఎస్. శ్రీనివాస్, సంతోషపురం గ్రామ సర్పంచ్ అంబటి రాంబాబు, జట్టు ట్రస్ట్ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, విఎఎ హరీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మలేరియా గుర్తింపులో ఆశాలదే కీలక పాత్ర

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా తక్షణ గుర్తింపులో ఆశావర్కర్లదే కీలక పాత్ర అని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. సోమవారం రావాడ రామభద్రపురం పిహెచ్‌సిని తనిఖీ చేసి ఎఎన్ఎం, ఆశావర్కర్లకు మలేరియా తీవ్రత, ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. జ్వరం ఉన్న ప్రతి ఒక్కరికి వీలైనంత త్వరగా చికిత్స అందజేయాలని, తద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించారు. ఆశావర్కర్లకు మలేరియా పరీక్షలు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మందులు పుష్కలంగా ఉన్నాయని, పాజిటివ్ వచ్చిన వెంటనే వైద్య అధికారికి తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చీకటి శంకరరావు, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ, సూపర్‌వైజర్ ఎస్తేరురాణి, ఎఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన ప్రయాణం చేయండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వాహనదారులు సురక్షితమైన ప్రయాణాలు చేయాలని స్థానిక ఎస్సై జి.కళాధర్ వాహనదారులకు సూచించారు. సోమవారం మండలం యు.వెంకంపేట పంచాయతీ పరిధి, గిరి పుణ్యక్షేత్రం వద్ద వాహనదారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అతివేగం ప్రమాదకరం ప్రాణానికి హాని కూడా కలుగ చేస్తుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ధ్రువ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు.

రెగ్యులర్ డిడిని నియమించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

ఐటిడిఎలో పనిచేసిన రెగ్యులర్ డిడి బదిలీ అయిన నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడికి ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించడం సరైన నిర్ణయం కాదని మన్యం గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు మంచాల ఈశ్వరరావు, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్ , ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ లోపం వల్ల, ఆఫీసులో సంబంధిత పనులకు అందుబాటులో లేకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కావున పార్వతీపురం ఐటిడిఎకు రెగ్యులర్ డిడిని నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

టిఫిన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటల చెల్లరేగి ఐ. చంద్రమౌళి టిఫిన్ సెంటర్ పురిపాకపై పడ్డాయి. మంటలు ఎగసిపడడంతో టిఫెన్ సెంటర్‌లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లకు నిప్పు అంటుకుని పేలిపోయాయి. దీంతో టిఫెన్ సెంటర్‌లో ఉన్న గ్రైండర్, వంట సామాగ్రి, విద్యుత్ పరికరాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సుమారు రెండు లక్షల పైబడి నష్టం వాటిల్లిందని బాధితులు రోదిస్తున్నారు. సర్వం కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల భవనం నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని బొడ్డపాడులో పాఠశాల భవన నిర్మాణం వెంటనే చేపట్టి తమ పిల్లలకు చదువుల విద్యాభివృద్ధి చేపట్టాలని ఆ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆగ్రామానికి చెందిన పోయి శ్రీరాం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పిల్లలకు చదువుకు దూరం అవుతున్నారని విమర్శించారు. పాఠశాల భవనం నిర్మించి గిరిజన చిన్నారులకు మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలనికోరారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో గ్రామస్తులే చిన్నపాటిపాక ఏర్పాటు చేయగా, అందులోనే చదువు చెప్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే స్కూలు భవనం నిర్మించాలని కోరారు.


పాఠశాల నిర్మించాలంటూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సారాతో పట్టుబడ్డ వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మేరాపువలస సమీపంలో సోమవారం ఉదయం 200 సారా ప్యాకెట్‌లతో వ్యక్తి పట్టుబడినట్లు హెచ్‌సి శ్రీనివాసరావు తెలిపారు. కన్నంపేట గ్రామానికి చెందిన చీకటి ఆదినారాయణ వీటిని పట్టుకెళ్తుండగా పట్టుపడ్డాడని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి సాలూరు కోర్టుకు రిమాండ్ కోసం తరలించామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సును సోమవారం నిర్వహించారు. తహశీల్దార్ ఆర్.శివన్నారాయణ మాట్లాడుతూ ప్రజలు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేదన్నారు. రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, సర్పంచ్ ఆర్.చైతన్య ప్రవంతి, సచివాలయం, రెవెన్యూ శాఖ సిబ్బంది ఉన్నారు.

గర్భిణీలకు వైద్య తనిఖీలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సోమవారం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, నితీశా, మానస గర్భిణులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, రక్తపోటు, బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ తదితరమైన వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని సూచనలు, సలహాలు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. పిఎంఎస్ఎంఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎస్.లలిత కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై సంతలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠపురం పంచాయతీలో సోమవారం జరిగిన వారపు సంతలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా నీలకంఠపురం ఎస్ఐ నీలకంఠరావు గిరిజన ప్రజలకు, యువతకు, మహిళలకు సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, రోడ్ యాక్సిడెంట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు వాడిన ప్రజలు, మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కొత్త, కొత్త నెంబర్లు నుంచి ఫోన్ చేసి బ్యాంకు లోన్ ఇస్తామని, లాటరీలు పేలాయనిఫోన్ చేస్తుంటారని, అటువంటి వాటికి ఎవరూ మోసపోకుండా ఉండాలని సూచించారు. అలాగే మత్తు పదార్థాలకు బానిస కాకుండా యువత సక్రమమార్గంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను జెఇ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట, కోటసీతారాంపురంలో ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన డ్రైనేజీ, సిసి రోడ్డు పనులను మండల ఇంజనీరింగ్ అధికారి జి.చంద్రమౌళి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ చట్టం కింద 67 పనులు మంజూరయ్యాయని, వీటికి రూ.2 కోట్ల 52 లక్షల నిధులు మంజూరై పనులు పూర్తిచేస్తే నిధులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీలు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ మాజీ సర్పంచులు కె.రామకృష్ణ, వి.గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - భామిని

మండలంలో పెద్దదిమిలిలో దళితులపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని దళిత సంఘం జెఎసి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. పెద్దదిమిలిలో ఆటస్థలంలో దళితులపై మూకుమ్మడి దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని, ఈ దాడిలో గాయపడిన దళితుడికి నష్టపరిహారం చెల్లించాలని దళిత సంఘం జెఎసి నాయకుకు కె.మిన్నరావు డిమాండ్ చేశారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ అప్పారావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘం జెఎసి సభ్యులు, దళితులు పాల్గొన్నారు.

నేడు న్యాయ అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహనా సదస్సు ఏర్పాటు చేయనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సదస్సుకు హాజరై చట్టాలపై అవగాహనా పెంచుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

16 నుంచి ఎలక్ట్రిషియన్, టెక్నీషియన్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 16 నుండి భద్రగిరి రెసిడెన్షియల్ ఐటిఐలో ఎలక్ట్రిషియన్, టెక్నీషియన్ మూడు నెలల శిక్షణను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్ కుమార్ తెలిపారు. పదో తరగతి పాస్సైన వారు ఈ కోర్సులకు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు 7981308980 నెంబర్ సంప్రదించవచ్చని, ఐటిఐకు వచ్చి జాయినింగ్ కావచ్చని అన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో కొత్తగా నిర్మించిన సచివాలయాల భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి పాల్గొంటారని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఉలిపిరి, చోళ పదం గ్రామాల్లో ఇటీవల నిర్మాణం చేపట్టిన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉలిపిరి నుంచి బిటి రహదారి పనులను శంకుస్థాపన చేస్తారని తెలిపారు. చోళ్లపదంలో జరిగే రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

రూ.65వేలు జరిమానా

ప్రజాశక్తి -పాలకొండ

అటవీ ఉత్పత్తులు అక్రమంగా తరలిస్తున్న వారికి అటవీశాఖ అధికారులు రూ.65వేలు అపరాధరుసుము విధించారు. మండలంలోని సిరికొండ వద్ద సోమవారం జరిపిన తనిఖీల్లో భాగంగా అక్రమంగా అటవీఉత్పత్తులైన కలప, కొండ చీపుర్లు తరలిస్తున్న వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకుని, రూ.65 వేల రూపాయలు అపరాధ రుసుం విధించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి రామారావు తెలిపారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో సంకల్పం

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వసంతలక్ష్మి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు. మహిళ చట్టాలు, భద్రత, రక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారి పాలక అమల, ఉపాధ్యాయులు పి. పద్మశ్రీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై విచారణ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాచిపెంట

భోజనం బాగోలేదన్న పట్టించుకోరా అని 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఈనెల 7న ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులకు కొంతమందికే భోజనాలు ఏర్పాటు చేశారని, మరికొంతమందికి భోజనాలు పెట్టలేదని ఎస్ఎంసి చైర్మన్ ఎడ్ల రమేష్‌ను లిఖితపూర్వకంగా నివేదిక కోరారు. 250 మంది పిల్లల తల్లిదండ్రులకు భోజనాలు సరిపడలేదని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. హెచ్ఎం బి.ఈశ్వరరావును దీనిపై విచారించగా, మధ్యాహ్న భోజన నిర్వహకులకు అందరికీ సరిపడే రేషన్ అందజేశానని ఆయన లిఖితపూర్వకంగా తెలిపారని తెలిపారు. ఈ విచారణ నివేదికను డిఇఒకు అందజేస్తామని డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్సీ గోపిమూర్తికి అభినందన

ప్రజాశక్తి -వీరఘట్టం

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి రౌండ్‌లోనే గెలుపొందిన యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి, పిడిఎఫ్ అభ్యర్థి బొర్ర గోపీమూర్తికి సోమవారం యుటిఎఫ్ మండల శాఖ నాయకులు అభినందనలు తెలిపారు. అభినందన తెలిపిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.రాజకుమారి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, గౌరవ అధ్యక్షులు ఎ.స్వామిబాబు, సహాధ్యక్షులు జెవి సూర్యప్రకాశ్, ఎస్.విశాలాక్షి, బి.వాసుదేవరావు ఉన్నారు.

మండల స్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కార్యాలయ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి మండల లెవెల్ లొకేషన్స్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ జి పైడితల్లి సోమవారం తెలిపారు. ఈ నెల 12,13 తేదీల్లో మండలస్థాయి అధికారులకు, విలేజ్ సర్వేయర్లు, ఏఎన్ఎంలు, వెటర్నరీ/ఫిషర్ అసిస్టెంట్‌లకు, జూనియర్ లైన్ మ్యాన్‌కు, 16, 17 తేదీల్లో సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చలర్/ సేరీకల్చలర్ అసిస్టెంట్‌లు, విలేజ్ రెవెన్యూ అధికారులకు, 18, 19 తేదీల్లో పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మహిళా పోలీసులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అనారోగ్యంతో విఆర్ఎ సత్యం మృతి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో విఆర్ఎగా విధులు నిర్వహిస్తున్న గాంధీనగర్ వీధికి చెందిన గరుగుబిల్లి సత్యం అనారోగ్యంతో గత కొంతకాలంగా బాధపడుతూ సోమవారం మృతి చెందారు. తహశీల్దార్ ఎం.రవణమ్మ, కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు, విఆర్ఎల జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు సత్యం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

వేతనదారులు, గ్రామస్తులు తప్పనిసరిగా తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేయించుకోవాలని ఎంపిడిఒ కె. గీతాంజలి కోరారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు ఖాతా లేనివారు పోస్టల్ శాఖ సచివాలయం సిబ్బంది సహకారంతో ఎన్‌పిసిఐ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ అనుసంధానంతో బ్యాంకు ఖాతాకి తెరవడానికి సహకరిస్తారని అన్నారు. ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఆరు గ్రామాల్లో 60 సమస్యలు

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని సోమవారం రెవెన్యూ సదస్సులను తహశీల్దార్ అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వలగెడ్డ, సోమగండి, జిల్లేడుపాడు, కొండ చోర్లంగి, శంభాం గ్రామాల్లో 60 సమస్యలు వచ్చాయని వీటిలో భూ సమస్యల పరిష్కారానిక చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అప్పలరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

తుపానుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని సోమవారం స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య రేగులపాడు, తూడి, చిదిమి తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. కోతలు కోసిన రైతులు వెంటనే కుప్పలు వేసుకుని వాటిపైన టార్పియన్లు కప్పాలని ఆమె అన్నారు.

గరుగుబిల్లి: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా రైతులు తగు ఏర్పాట్లు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.విజయభారతి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె రైతులకు తగు సూచనలు , సలహాలు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ హెచ్చ రికల నేపథ్యంలో ధాన్యం తక్షణమే సమీపంలోని రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అలాగే రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. అలాగే కోసిన వరి పంటలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, లేదా కుప్పలు వేయాలని పేర్కొన్నారు. రైతుసేవా కేంద్రాలకు సంబంధించిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామాల్లో రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఇప్పటికే కోసిన వరి పంట సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తుఫాను తగ్గేంత వరకు రైతులు వ్యవసాయ పనులను వాయిదా వేసుకోవాలని కోరారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని రైతులు తయారుచేసిన ధాన్యం బస్తాలను సమీపంలోని మిల్లులకు తరలించేలా తగు చర్యలు చేపడుతున్నామని ఎఒ తెలిపారు.